
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.21

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 ప్రకారం పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/23.2°

జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

- కలెక్టర్ చేతన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: 2047 నాటికి 15 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో వికసిత్ ఆంధ్రా–2047లో భాగంగా జిల్లా యాక్షన్ ప్లాన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ప్రాథమిక రంగాలలో వృద్ధికి వంద రోజుల ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, గ్రామ/వార్డు సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



అక్రమ మద్యం బాటిళ్లను జేసీబీతో ధ్వంసం చేస్తున్న దృశ్యం

పెనుకొండ: పోలీసులు, సెబ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన సుమారు రూ.68 లక్షల విలువైన అక్రమ మద్యం, నాటుసారాను శనివారం ధ్వంసం చేశారు. పెనుకొండ పట్టణ సమీపంలోని షీఫారం వద్ద ఘాట్ రోడ్డులో జేసీబీతో తొక్కించారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ రత్న, ఏఎస్పీ విష్ణు, సెబ్ ఏఈఎస్ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెబ్, పోలీసులు కలసి పది నెలలుగా చేసిన దాడుల్లో 10,015 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీన్ని ఇక్కడ ధ్వంసం చేస్తున్నామన్నారు. ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ భవిష్యత్తులోనూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

జిల్లా అభివృద్ధికి పాటుపడదాం

అనంతపురం సిటీ: 'పాలకవర్గం, అధికారులు, ఉద్యోగులు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేద్దాం. జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడదాం' అని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జెడ్పీ సీఈఓ (ఎఫ్ఏసీ)గా నియమితులైన చిలంకూరు ఓబుళమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెడదామని సూచించారు. అంతకు ముందు జెడ్పీ ఉద్యోగులు సీఈఓకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

డెంగీ బూచి.. కాసులు దోచి

- ఇటీవల ఆరేళ్ల చిన్నారి జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పలు పరీక్షల అనంతరం డెంగీ సోకినట్లు అక్కడి వైద్యుడు నిర్ధారించారు. నాలుగు రోజులు చికిత్స చేసి రూ.14 వేలు బిల్లు చేశారు. అదనంగా బెడ్ ఫీజు, టోకెన్, పరీక్షలు కలిపి మరో రూ.9 వేలు దండుకున్నారు. అయితే డెంగీ సోకిందా? లేదా? అనేది స్పష్టంగా చెప్పడం లేదు.
- మూడు వారాల క్రితం పుట్టపర్తికి చెందిన ఓ 30 ఏళ్ల మహిళకు జ్వరం రాగా, స్థానిక క్లినిక్‌లో డాక్టర్‌ను సంప్రదించింది. ఏదైనా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని సూచించడంతో హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. అక్కడి వైద్యుడు ఆమెకు ఐదు రోజుల పాటు చికిత్స చేశారు. ప్లేట్‌లెట్ కౌంట్ చెప్పలేదు. కానీ బిల్లు మాత్రం రూ.18 వేలు వేసినట్లు బాధితురాలు వాపోయారు.

...ఇలా కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు డెంగీ పేరుతో రోగులను దోచేస్తున్నారు. సాధారణ జ్వరాలనూ డెంగీగా నిర్ధారించి రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారు.



జ్వరాలను క్యాష్ చేసుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

- సాధారణ జ్వరాలనూ డెంగీగా చూపుతూ దోపిడీ
- పరీక్షల పేరుతో రోగుల నుంచి భారీ వసూలు
- జిల్లాలో ఇప్పటివరకూ నమోదైన పాజిటివ్ కేసులు 52

సాక్షి, పుట్టపర్తి

వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యులు పరీక్షల పేరుతో భారీగా డబ్బులు దండుకుంటున్నారు. కనీసంగా రూ.10 వేలు బిల్లు చేస్తున్నారు. కాస్త జ్వరం ఎక్కువగా ఉంటే చాలు...అడ్మిషన్ కావాలని సూచిస్తున్నారు. రెండు రోజులు అడ్మిషన్‌లో ఉంచుకుని రూ.50 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. అసలు ఏ పరీక్ష చేస్తున్నారో...డెంగీగా ఎలా నిర్ధారిస్తున్నారో చెప్పడం లేదని, గట్టిగా అడిగితే 'డాక్టర్ నువ్వా...నేనా' అంటూ దబాయిస్తున్నారని రోగులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవుతున్న డెంగీ కేసులు... ప్రైవేటు వైద్యులు చెబుతున్న కేసుల లెక్క చూస్తే దోపిడీ ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

'ప్రైవేటు' లెక్కలు వేరు

వర్షాకాలం...పారిశుధ్య లోపంతో దోమల వ్యాప్తి చెందుతున్నాయి. మున్సిపాలిటీల్లో కనీసం ఫాగింగ్ కూడా చేయకపోవడంతో దోమకాట్లతో జనం జ్వరాల బారిన పడుతున్నారు. స్థానికంగా ఉండే వైద్యులతో చికిత్స చేయించుకున్నా జ్వరం తగ్గకపోవడంతో ప్రైవేటుకు పరుగు తీస్తున్నారు. రోగి ఆందోళనను ప్రైవేటు వైద్యులు క్యాష్ చేసుకుంటున్నారు. ఏ జ్వరమైనా సరే డెంగీగా తేల్చేస్తూ భారీగా పిండేస్తున్నారు. మామూలుగా మంచినీటిలో పెరిగే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కుడితేనే డెంగీ వస్తుందని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో చాలా తక్కువ కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాది ఇప్పటి వరకూ 802 మందిని పరీక్షించగా.. 52 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ప్రైవేటు వైద్యుల లెక్కలు వేరేగా ఉన్నట్లు తెలుస్తోంది. జ్వరపీడితుల ప్లేట్‌లెట్లు బాగానే ఉన్నప్పటికీ డెంగీ సోకిందని భయపెట్టి మూడు, నాలుగు రోజుల పాటు చికిత్స చేస్తున్నారు.

జ్వరంతో వెళ్తే చాలు డెంగీగా నిర్ధారణ

ఎన్ఎస్1 యాంటీజెన్, ఐజీఎం ఎలిసా టెస్టు...ఈ రెండు పద్ధతుల్లోనే డెంగీ జ్వరాన్ని నిర్ధారిస్తారు. అయితే ప్రైవేటు ఆస్పత్రుల్లో ర్యాపిడ్ ఎన్ఎస్1 యాంటిజెన్ టెస్టును ప్రామాణికంగా తీసుకుని వైద్యం చేస్తున్నారు. సాధారణ జ్వరాలను కూడా డెంగీ పాజిటివ్‌గా చూపించి డబ్బులు పిండుతున్నారు. అంతేకాకుండా ప్లేట్‌లెట్ కౌంట్, ఐసీయూ చికిత్సల పేరుతో హడావుడి చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. డెంగీ బారిన పడిన రోగుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్య శాఖాధికారులకు తెలియజేయాల్సి ఉన్నా.. ప్రైవేటు వైద్యులు సమాచారం ఇవ్వడం లేదు. 'ఉత్తుత్తి డెంగీ' కాబట్టే వారు వివరాలు చెప్పడం లేదని తెలుస్తోంది.

జిల్లాలో నమోదైన డెంగీ కేసుల వివరాలు

సంవత్సరం	కేసుల సంఖ్య
2020	28
2021	46
2022	195
2023	166
2024 (ఇప్పటివరకు)	52

ఇవీ ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన డెంగీ పాజిటివ్ కేసులు.. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం ఎడాపెడా టెస్టులు చేసి డెంగీగా నిర్ధారించి చికిత్సలు చేస్తున్నారు. అయితే ఈ వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు మాత్రం పంపడం లేదు.



ప్రైవేటుకు ఎవరూ వెళ్లొద్దు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. డెంగీ వ్యాధికి సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు పరికరాలూ ఉన్నాయి. ఎవరూ తొందరపడి ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లకండి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ విషయం మా దృష్టికి రాలేదు. అనవసరంగా డెంగీ అని నిర్ధారణ చేయడం నేరం. అలా ఎవరైనా చేసినట్లు నిరూపణ అయితే చర్యలు తీసుకుంటాం. డెంగీ సంబంధిత పరీక్షలు సక్రమంగా నిర్వహించి నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

– డాక్టర్ మంజువాణి,
జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి

ఏకపక్షంగా మైదుగోళం ఎస్ఎంసీ ఎన్నిక

- కోరం లేకపోయినా హాజరు సృష్టించి మరీ ఎన్నిక
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను బలవంతంగా పంపించిన పోలీసులు
- టీడీపీ నేతలకు తొత్తులా వ్యవహరించిన ఎంఈఓ నాగరాజు



హెచ్‌ఎంపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నేతలు

చిలమత్తూరు(లేపాక్షి): లేపాక్షి మండలంలోని మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నిక ఏకపక్షంగా సాగింది. ఈ నెల 8న నిర్వహించిన ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గెలిచే పరిస్థితి ఉండడంతో టీడీపీ నాయకులు ఆరో తరగతిలో ఇద్దరు సభ్యుల సంఖ్య తక్కువగా ఉందంటూ రభస చేసి వాయిదా వేయించారు. ఇదే ఎన్నికను శనివారం నిర్వహించారు. అయితే.. శుక్రవారం రాత్రే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను పోలీసులు గ్రామం నుంచి బలవంతంగా పంపించివేశారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకే పాఠశాల వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించారు. 85 శాతంగా ఉన్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను పోలీసులు గ్రామం నుంచి ఖాళీ చేయించడాన్ని నిరసిస్తూ 1–5వ తరగతి వరకూ కోరం సభ్యులు పాఠశాలకు హాజరు కాలేదు. మొత్తం 122 మంది సభ్యులు ఉండగా..చాలామంది హాజరుకాకపోవడంతో కోరం లేదు కాబట్టి ఎన్నిక వాయిదా వేయాలని వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు హెచ్‌ఎంను కోరారు. ఆయన కూడా కోరం లేకపోతే ఎన్నిక నిర్వహించలేమని చెప్పారు. అయితే..టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. మారుతీ ప్రసాద్, జయప్ప తదితర టీడీపీ నాయకులు హెచ్‌ఎంను బెదిరించడంతో ఎన్నిక ప్రక్రియ మొదలుపెట్టారు. కోరం లేకపోయినా 67 మంది ఉన్నట్టు ఉపాధ్యాయులు చెప్పడం, చకచకా పోలింగ్ నిర్వహించడం ఏకపక్షంగా జరిగిపోయాయి. టీడీపీ మద్దతుదారు షాజహాన్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఎంఈఓ తీరుపై విమర్శలు

సమస్యాత్మకమైన మైదుగోళం ఎంపీయూపీ ఎస్ఎంసీ ఎన్నికకు హాజరుకావాల్సిన ఎంఈఓ నాగరాజు కలెక్టర్ ప్రోగ్రాం పేరుతో డుమ్మా కొట్టారు. పైగా కోరం లేదని హెచ్ఎం క్షీరలింగేశ్వర్.. ఎంఈఓకు ఫోన్ చేసి చెప్పినా, టీడీపీ మద్దతుదారును ఏకగ్రీవ ఎన్నిక చేసేయాలని ఎంఈఓ తెలపడం విమర్శలకు తావిచ్చింది. బాధ్యతాయుతంగా మెలగాల్సిన ఎంఈఓ టీడీపీ నేతలకు వత్తాసు పలకడాన్ని పలువురు తప్పుబట్టారు.

పోలీసులా? టీడీపీ కార్యకర్తలా?

మైదుగోళం ఎస్ఎంసీ ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు మురళీరెడ్డి, రామాంజి పాఠశాల వద్దకు రాకూడదని, ఊరు విడిచి వెళ్లిపోవాలని పోలీసులు ఆదేశాలివ్వడంతో భయంతో వారు గ్రామం వదిలారు. అయితే.. అసంబద్ధమైన ఎన్నికను సమర్థించబోమని వైఎస్సార్‌సీపీ మద్దతుదారులెవరూ ఎన్నికకు హాజరు కాలేదు. ఎన్నిక వాయిదా పడుతుందని అందరూ భావించినా.. అర్హతలేని వారిని సభ్యులుగా చూపించి ఎన్నిక నిర్వహించారు. దీన్ని సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయిస్తామని వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు తెలిపారు.

సంతలో పశువుల్లా కొంటున్నారు

- మునిసిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కొందరు కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకోవడం సిగ్గుచేటు
- దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో గెలవాలి
- వైఎస్సార్‌సీపీ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి, కౌన్సిలర్ల సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి, కౌన్సిలర్లు

హిందూపురం: ఎమ్మెల్యేల నుంచి సర్పంచుల దాకా సంతలో పశువుల్లా కొనే సంప్రదాయం టీడీపీదని, హిందూపురం మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను, మరో ఎనిమిది మంది కౌన్సిలర్లను ఎమ్మెల్యే బాలకృష్ణ టీడీపీలో చేర్చుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి, పార్టీ కౌన్సిలర్లు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం హిందూపురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో పాటు వాల్మీకులను రాజకీయంగా ముందుకు తేవాలని భావించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఇంద్రజకు కట్టబెడితే ఆమె పార్టీకి ద్రోహం చేసి టీడీపీకి అమ్ముడుపోయారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సంతలో పశువులను కొన్నట్లుగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను కొనేసి చైర్మన్ పీఠంపై కూర్చోవాలనుకుంటే రాబోవు ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసిన వారిని నెత్తిన పెట్టుకుంటున్నారు.. రేపు మీకు కూడా ఇదే పరిస్థితి వస్తుందని ఎమ్మెల్యే బాలకృష్ణను హెచ్చరించారు. కేవలం స్వార్థం, స్వలాభం కోసం టీడీపీలోకి వెళ్లిన మీరు (కౌన్సిలర్లు) వార్డు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం వెళ్లినట్లు చెప్పుకుంటున్నారు.. ఇన్నాళ్లూ అధికారంలో ఉన్నారు కదా..అప్పుడు అభివృద్ధి కనిపించలేదా అని ప్రశ్నించారు. అభివృద్ధి అనేది సాకు మాత్రమేనని, కేవలం స్వార్థం కోసమే టీడీపీలోకి వెళ్లారని దుయ్యబట్టారు. అభివృద్ధి గురించి చైర్‌పర్సన్ గానీ, అన్నీ తెలిసి అర్హతలేనివారికి అందలం ఎక్కించిన ఓ విశ్రాంత పోలీస్ పెద్దమనిషి గానీ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. చైర్‌పర్సన్ రైల్వేరోడ్డు గురించి పెట్టిన మొదటి సంతకానికే దిక్కులేకుండా పోయిందన్నారు. తాము చొరవ తీసుకుని గత ఎన్నికల ముందు అహుడా నిధులు మంజూరు చేయించామని వేణురెడ్డి తెలిపారు. దండురోడ్డు, పులమతి రోడ్డుతో పాటు మరో రెండు రోడ్లకు కూడా నిధులు మంజూరు చేయించామని, కొటిపి రోడ్డుకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు. ఇప్పుడు మీరు ఇవన్నీ మొదలుపెట్టి పూర్తి చేస్తే సంతోషిస్తామన్నారు.


దమ్ముంటే రాజీనామా చేయండి

దమ్ముంటే రాజీనామా చేయండి.. ప్రజల ముందుకు వెళ్దాం.. మీరు గెలిస్తే మేము నేలకు ముక్కు రాసుకుంటాం.. సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే బాలకృష్ణతో ఒప్పందం ప్రకారం పార్టీలో చేరారని పత్రికలలో రాశారని, దీన్నిబట్టే అమ్ముడుపోయినట్లు అందరికీ అర్థమైపోయిందని అన్నారు. చిలమత్తూరు మండలంలోనూ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను భయపెట్టి, పోలీసులతో ఒత్తిడిచేసి టీడీపీలో చేర్చుకున్నారని విమర్శించారు. అలాగే ఎంపీపీపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టడం ద్వారా రాజీనామా చేయించి ఆ స్థానంలో కూర్చోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు జయప్ప, శివ, ఆసీఫ్‌వుల్లా, నాగేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మన్సూర్, రాము నాయకులు బాలాజీమనోహర్, దాదాపీర్, డాక్టర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు అసంబద్ధం

- జిల్లా కేంద్రం మారిస్తే ఉద్యమిస్తాం
- టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మారుతీరెడ్డి

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి హిందూపురానికి మారిస్తే ఉద్యమిస్తామని టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ అధికార ప్రతినిధి తలమర్ల మారుతీరెడ్డి హెచ్చరించారు. ఆయన శనివారం పుట్టపర్తిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం హిందూపురంలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా హిందూపురం చేస్తామని పేర్కొనడాన్ని ఆయన తప్పుబట్టారు. వైఎస్ జగన్ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం, పారిశ్రామికరంగ ప్రగతిని కాంక్షించి భగవాన్ శ్రీసత్యసాయి బాబా పేరిట పుట్టపర్తి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఇది హిందూపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకూ సమ్మతంగా ఉందన్నారు. అయినప్పటికీ బాలకృష్ణ ఏమి ప్రయోజనాలు ఆశించి హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. బాలకృష్ణ వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయని విమర్శించారు. అదే జరిగితే టీడీపీకి రాజీనామా చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. బాలకృష్ణ వ్యాఖ్యలు పుట్టపర్తి ప్రాంత ప్రజలనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి భక్తులను అవమానించినట్లుగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లాను కొనసాగించటంతో పాటు అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు బాలకృష్ణ వ్యాఖ్యలు చూస్తే లోకేష్ మాటలకు విలువ లేదా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రాన్ని మార్చాలని బాలకృష్ణ కోరడం సబబు అయితే..జగన్ ప్రభుత్వం గతంలో తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయమూ సబబే అవుతుందన్నారు.



కొడపగానిపల్లి వద్ద వంగపేరు ఉధృతితో నిలిచిన వాహన రాకపోకలు



నిడిమామిడి వద్ద పంట పొలాల్లోకి భారీగా చేరిన వర్షపునీరు



పెదపల్లి వద్ద నీట మునిగిన అనప పంట



మరువ పారుతున్న గాజులపల్లి చెరువు

కుమ్మేసిన వాన

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ 29 మండలాల్లో 45 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ధాటికి పుట్టపర్తి మండలంలోని గాజులపల్లి చెరువు నిండి మరువ పారింది. చిత్రావతి నది పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. పైనున్న సీకేపల్లి, పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో కొత్తచెరువు, బుక్కపట్నం, ధర్మవరం మండలాల మీదుగా వంగపేరు నది ఉధృతంగా ప్రవహించింది. దీంతో పుట్టపర్తి మండలం కొట్లపల్లి, కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి వద్ద ప్రధాన రోడ్డుపై శనివారం మధ్యాహ్నం వరకూ రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ బస్సులను రూట్లు మార్చి నడిపారు. ముఖ్యంగా పుట్టపర్తి– అనంతపురం బస్సులు ధర్మవరం మీదుగా కాకుండా పెనుకొండ మీదుగా నడిపారు. వరద ఉధృతి తగ్గడంతో మధ్యాహ్నం నుంచి వాహనాలను అనుమతించారు.

అమరాపురంలో అత్యధికం

అమరాపురంలో అత్యధికంగా 98.2 మి.మీ. వర్షం కురిసింది. అలాగే గోరంట్ల 95.4, మడకశిర 88.4, సీకేపల్లి 86.4, ముదిగుబ్బ 82.4, తాడిమర్రి 76.8, బుక్కపట్నం 75.6, బత్తలపల్లి 64.2, రామగిరి 62.8, కొత్తచెరువు 62.4, రొళ్ల 62.2, ధర్మవరం 54.6, కనగానపల్లి 54.2, పెనుకొండ 50.2, పుట్టపర్తి 45.2, సోమందేపల్లి 43.8, పరిగి 43.6, అగళిలో 42.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుడిబండ, చిలమత్తూరులో 41.6 మి.మీ. చొప్పున, అమడగూరు, రొద్దంలో 35.2 మి.మీ., నల్లమాడ 26.4, లేపాక్షి 25.2, హిందూపురం 19.4, ఓడీచెరువు 18.4, తలుపుల, కదిరిలో 5.2 మి.మీ. చొప్పున, నల్లచెరువులో 2 మి.మీ. వర్షం కురిసింది.

నీట మునిగిన పంటలు

భారీ వర్షానికి పలు రకాల పంటలు నీట మునిగాయి. గ్రామీణ రోడ్లు కోతకు గురయ్యాయి. పొలాల రోడ్లు ఛిద్రమయ్యాయి. పుట్టపర్తి మండలంలోని నిడిమామిడి వద్ద సుమారు పది ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలు నీట మునిగాయని రైతులు వాపోయారు. పెదపల్లి వద్ద మొక్కజొన్న, టమాట పంటలు దెబ్బతిన్నాయి.



ధర్మవరం మండలం పోతులనాగేపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి నది

వేపచెట్టుపై పిడుగు

నల్లచెరువు: మండలంలోని ప్యాయలవాండ్లపల్లిలో శనివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. అదే సమయంలో దాసరి ఆంజనేయులు, శ్యామలమ్మ దంపతుల ఇంటి సమీపంలోని వేప చెట్టుపై పిడుగు పడింది. ఆ సమయంలో దంపతులిద్దరూ పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి దర్శనానికి వెళ్లడంతో ప్రమాదం తప్పింది. పిడుగుపాటుకు ఆంజనేయులు ఇంటి పైకప్పు, టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్, పట్టు చీరలతో పాటు గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నాయి.

క్లుప్తంగా

ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు


భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీ ఆలయం

కదిరి టౌన్: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామిని అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయం ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలతో అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేపట్టారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం: కర్నూలు రేంజ్ పరిధిలో పలువురి సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వి. చిన్న పెద్దయ్య సీసీఎస్, అన్నమయ్య సీఐను వీఆర్ (అనంతపురం రేంజ్)కు బదిలీ చేశారు. అలాగే సీఐ నరేంద్రరెడ్డిని కడప పోలీస్ కంట్రోల్ రూంకు శుక్రవారం బదిలీ చేయగా, తాజాగా శనివారం బదిలీని నిలుపుదల చేశారు.
☛ అనంతపురం జిల్లా పరిధిలో ఎస్ఐ బి. తులసమ్మ (వీఆర్ ఎస్పీ, శ్రీ సత్యసాయి)ని అనంతపురం పోలీస్ కంట్రోల్ రూంకు , తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.సాగర్‌ను నార్పల పోలీస్‌స్టేషన్‌కు, నార్పలలో పనిచేస్తున్న ఎస్ఐ ఎన్.రాజశేఖర్ రెడ్డి వీఆర్ ఎస్పీకి బదిలీ చేశారు.

దైవ దర్శనానికి వచ్చి.. తిరిగి రాని లోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు కుమార్

పావగడ: ద్వితీయ శ్రావణ శనివారోత్సవాన్ని పురస్కరించుకుని శనీశ్వరస్వామికి పూజలు అందించి స్వగ్రామానికి పయనమైన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. అరసికెరె గ్రామానికి చెందిన తిమ్మయ్య కుమారుడు కుమార్(24) శనివారం శనీశ్వరుడిని దర్శించుకున్నాడు. అనంతరం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. కెరెక్యాతనహళ్లి సమీపంలోని స్వారమ్మ ఆలయం వద్ద బైక్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. వెనుక వస్తున్న గుర్తు తెలియని వాహనం అతడిపై వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు అరసికెరె ఎస్ఐ తారాసింగ్ తెలిపారు.

అంతా 'వేమ'మయం!

సమాజంలో మంచిచెడులు, అసమానతలు, మానవత్వాన్ని శతకరూపంలో అందించిన మహనీయుడు ప్రజాకవి యోగి వేమన. వేమన పద్యాలు తెలియని తెలుగు వారు, ఆయన పద్యాన్ని చదవని విద్యార్థి ఉండరంటే అతిశయోక్తి కాదేమో. అలాంటి మహనీయుడు జీవసమాధి అయిన ప్రాంతం ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. ఆ ప్రాంతంలోని మూడు గ్రామాల ప్రజలు వేమనను ఇలవేల్పుగా కొలవడమేగాకుండా తమ పిల్లలకు 'వేమ'నామాన్ని పెట్టి స్మరించుకుంటున్నారు.

- ఆ మూడు గ్రామాల్లో వేమన పేరున్నవారే అధికం
- ఏకంగా వేమన పేరుతో ఊరిపేరు


యోగి వేమన సమాధి


కటారుపల్లి గ్రామం

గాండ్లపెంట: వేమన జీవ సమాధి అయిన కటారుపల్లి ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. నిత్యపూజలతో పాటు ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజలు ఆయన్ను స్మరించుకుంటున్నారు. మండలంలోని కటారుపల్లిలో ప్రజాకవి యోగి వేమన క్రీ.శ 1480లో జీవ సమాధి అయ్యారు. వేమన వంశీకులు 1933లో ఆలయం నిర్మించారు. నిత్య పూజలు చేస్తూ రావడంతో ఆ పరిసర గ్రామాల ప్రజలు వేమన తమ ఇలవేల్పుగా కొలుస్తున్నారు. ప్రతి ఆదివారం ఆలయంలో జరిగే పూజలకు పరిసర గ్రామాల ప్రజలేగాక పక్క జిల్లాలైన వైఎస్సార్, పొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వేమన భక్తులు తరలివస్తారు. వేమన సమాధిని సందర్శించుకుని పూజలు చేస్తే ఆరోగ్యంగా ఉంటారని నమ్మకం కలగడంతో, మొక్కులు తీరిన వారు ఏటా జనవరిలో ఆలయంలో నిర్వహించే సంతర్పణ రోజున పొర్లు దండాలు చేస్తారు.

వేమనపురంగా దాసరిండ్లు..
కటారుపల్లి, కటారుపల్లి గొల్లపల్లి, దాసరిండ్లు గ్రామాల్లో చాలామంది ప్రజలు వేమయ్యను ఇలవేల్పుగా కొలుస్తారు. అందుకే తమ పిల్లలకు వేమయ్య, వేమనారాయణ, వేమనాథ్, వేమనారాయణమ్మ, వేమనారద, వేమాప్రసాద్, వేమనారాయణమ్మ, వేమక్క, వేములమ్మ తదితర పేర్లు పెట్టుకుంటారు. పేరు ముందుకు వేమ చేరిస్తే పిల్లలు వృద్ధిలోకి వస్తారని వారి నమ్మకం. ఇక దాసరిండ్లు గ్రామం పేరును గ్రామస్తులు ఏకంగా వేమనపురంగా మార్చేశారు.

వైఎస్సార్ హయాంలో ఆలయాభివృద్ధి
ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఆలయ పునఃనిర్మాణానికి దాదాపుగా రూ.2 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. వీటితో ఆలయ ప్రాకారంతో పాటు సందర్శకుల కోసం విడిది గృహాలను సైతం నిర్మించారు. ఏటా పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఉగాది పండుగ ముగిసిన వారం రోజులకు యోగి వేమన బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు వేలాది ప్రజలు హాజరవుతుంటారు.

ఏ పని చేయాలన్నా సమాధి సందర్శన



గ్రామస్తులతో పాటు ఇతర జిల్లాల వారు ఏ పని చేయాలన్నా వేమన సమాధిని సందర్శించుంటారు. ఇలా చేస్తే తమ పనులకు ఎలాంటి అడ్డంకులున్నా తొలగిపోతాయని వారి నమ్మకం. మొక్కు ఫలించిన వారు సంతర్పణం రోజున ఆలయం ఎదుట పొర్లు దండాలు పెట్టి తలనీలాలు సమర్పిస్తారు. **–తుంగ చంద్రాయుడు, ఆలయ పీఠాధిపతి**

మొక్కు ఫలించడంతో..



మా తల్లిదండ్రులు వేమన సమాధిని సందర్శించి మగ సంతానం కావాలని మొక్కుకున్నారు. మొక్కు ఫలితంగా నేను జన్మించానని నా పేరును వేమయ్యగా పెట్టారు. వేమన మహిమాన్వితుడు కావడంతో పరిసర గ్రామస్తులే కాక ఎంతో దూరం నుంచి భక్తులు స్వామిని సందర్శించుకునేందుకు వస్తుంటారు.
– వేమయ్య, కటారుపల్లి

అంతా మంచే జరుగుతుంది



వేమన స్వామి పేరు తలకుంటే అంతా మంచే జరుగుతోంది. దీంతో నా పేరు వేమనారాయణమ్మ, మా తమ్ముడి పేరు వేమయ్య అని పెట్టారు. వేమన సమాధిని సందర్శిస్తే ఎలాంటి పనులైన సులభంగా జరుగుతాయి. మా గ్రామంలో 40 ఇళ్లు ఉంటే ఇంటికి ఒకరు లేదా ఇద్దరు ఆ పేర్లు గల వారున్నారు.
– వేమనారాయణమ్మ, దాసరిండ్లు(వేమనపురం)

ఖాద్రీశుడి సన్నిధిలో పాండిచ్చేరి హోంమంత్రి, 'అనంత' మాజీ ఎస్పీ


హోంమంత్రికి శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని శనివారం పాండిచ్చేరి హోం మంత్రి తిరు ఓంనమః శివాయ, అనంతపురం మాజీ ఎస్పీ కేవీ మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం వారిని దుశ్శాలువాలో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసి శ్రీవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ డీఎస్పీ శ్రీలత, తహసీల్దార్ మురళీకృష్ణ, సీఐ నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దాడులు చేసిన టీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోండి


బాధితులతో కలసి ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న పెన్నోబులేసు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా కులం పేరుతో దూషిస్తూ ఎస్సీలపై దాడులకు పాల్పడుతున్న టీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు ఎస్పీ రత్నను కోరారు. శనివారం ఎస్పీ బంగ్లాలో ఆమెకు బాధితులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ హరిజన రామ్మోహన్‌పై అదే గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయుడు, యంగమునినాయుడు, అలీ అనే ముగ్గురు హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. దీనిపై బుక్కపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ఈవిషయం మనసులో పెట్టుకొని నిందితుల బంధువులైన రాజేష్, చెన్నప్పనాయుడు, భాస్కర్ తరచుగా రామ్మోహన్‌ను కులం పేరుతో దూషించడంతోపాటు దాడులు చేస్తున్నారన్నారు. అలాగే నల్లమాడ మండలం ఎనుములవారిపల్లిలో ఉపేంద్ర, నరశింహులు, గంగాద్రిపై టీడీపీకి చెందిన కుమ్మర గంగాద్రి, జనార్దన్ వేటకొడవళ్లతో దాడులు చేశారన్నారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అధికార పార్టీ అండదండలతో చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్సీలకు రక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిపై చర్యలు సుకోవాలని ఎస్పీని కోరారు. విచారణ జరిపి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

రెండు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

బత్తలపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మృతి చెందగా రెండు రోజుల పాటు ఇంట్లోనే మృతదేహం ఉంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం.. మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన హరిజన క్రిష్ణయ్య(65), అతని భార్య కుళ్లాయమ్మ ఎస్కేయూలో స్వీపర్‌గా పని చేస్తోంది. కుళ్లాయమ్మ, కుమారుడు, కోడలితో కలిసి ఎస్కేయూలోనే అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. క్రిష్ణయ్య మాత్రం సంజీవపురంలో ఉంటూ ఆదోని మహాలక్ష్మీమాతను కొలిచేవాడు. ఇంట్లోకి ఎవ్వరినీ రానిచ్చేవాడు కాదు. అయితే రెండు రోజుల క్రితం విరేచనాలతో బాధపడుతూ ఇంట్లోనే ఉన్నాడు. ఈక్రమంలో నిద్రలోనే ప్రాణం కోల్పోయాడు. రెండు రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో కాలనీవాసులు శనివారం ఇంటి తలుపులు తెరిచి పిలిచినా స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. సహజ మరణం కావడంతో కేసు నమోదు చేయలేదని సమాచారం.

జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సు బోల్తా

- స్వల్పగాయాలతో బయటపడిన ప్రయాణికులు


జాతీయ రహదారిపై అడ్డంగా పడిన ట్రావెల్స్ బస్సు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం ప్రైవేటు బస్సు బోల్తాపడింది. ఘటనలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాలు..హైదరాబాద్ నుంచి ప్రైవేటు బస్సు ప్రయాణికులతో బెంగళూరు బయలుదేరింది. తెల్లవారుజామున చెన్నేకొత్తపల్లి వద్దకు రాగానే బస్సు అదుపు తప్పి జాతీయ రహదారిపై రోడ్డుపై అడ్డంగా బోల్తాపడింది. ప్రయాణికుల అరుపులు విన్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని బస్సు అద్దాలను పగుల గొట్టి ప్రయాణికులను బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 33 మంది ప్రయాణికులు ఉన్నట్లు మరో డ్రైవర్ బాబురావు తెలిపారు. బస్సు రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్ కొంతసేపు స్తంభించింది. అయితే ఈ ప్రమాదంలో ఆ సమయంలో బస్సును నడుపుతున్న డ్రైవర్ రమేష్ తలకు చిన్న గాయం కావడంతో స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వాటిని లెక్కచేయకుండా ఇతర వాహనాల్లో బెంగళూరుకు వెళ్లిపోయారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించారు. తర్వాత జేసీబీ, క్రేన్‌తో బస్సును రోడ్డుపై నుంచి తొలగింపజేశారు.

ఉద్రిక్తత నడుమ ఎస్ఎంసీ ఎన్నికలు


జనసేన నేత మహేష్‌ను లాక్కెళుతున్న పోలీసులు

సోమందేపల్లి: మేకలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికల్లో ఉద్రిక్తత చోటుచేసుంది. వివరాలు.. టీడీపీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప అనుచరుడు గంగాధరప్పను చైర్మన్‌గా ఎన్నుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు పట్టుబట్టారు. అయితే మెజార్టీ పేరెంట్స్ మద్దతు ఉన్న జనసేన నేత మహేష్ అనుచరుడు సిద్దప్పను ఎన్నుకోవాలని ఆ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు అధికారులతో వాదనకు దిగారు. ఈక్రమంలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌బాబు అక్కడికి చేరుకొని పోలింగ్ చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోలింగ్ జరపగా జనసేన మద్దతుదారుడు సిద్దప్పకు 13 ఓట్లు, టీడీపీ నాయకుడు గంగాధరప్పకు 7 ఓట్లు వచ్చాయి. వైస్ చైర్‌పర్సన్‌గా పార్వతమ్మ ఎన్నికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం గోవిందనాయక్ తెలిపారు. కాగా ఓటు హక్కున్నా టీడీపీ నాయకులు, అధికారులు బలవంతంగా తనను బయటకు పంపారని జనసేన నేత మహేష్ వాపోయాడు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



మృతులు అనిల్‌కుమార్, పుట్టరాజు

పావగడ: విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన దుర్ఘటన అరసికెరె పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్ బెట్ట గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ తారాసింగ్ అందించిన వివరాలు..టీఎన్ బెట్ట గ్రామానికి చెందిన దివ్యాంగుడు వడ్డెర పుట్టరాజు(35) తమ 3 ఎకరాల పొలంలో వేరుశనగ సాగు చేశాడు. శుక్రవారం రాత్రి పొలంలో కాపాల కోసం తన బంధువైన అనిల్‌కుమార్(29)ను తోడుగా తీసుకెళ్లాడు. ఈక్రమంలో పొలంలో నెమళ్లు, కుందేళ్లు, అడవి పందులు రాకుండా పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెను తాకారు. దీంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం ఉదయం పొలంలోకి వెళ్లిన కూలీలు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా మృతుడు పుట్టరాజు తండ్రి రామరాజప్ప మాట్లాడుతూ తోట చుట్టూ తంతి కంచె మాత్రం వేయించామని, విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇంకా ఇప్పించలేదని, తన కుమారుడు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి ఉంటాడని బోరున విలపించాడు. అరసికెరె ఎస్ఐ తారాసింగ్, పీసీ సిద్ధేశ్, బెస్కాం అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా పుట్టరాజుకు భార్య మృతి చెందింది. ఇద్దరు పిల్లలున్నారు. అనిల్‌కుమార్ అవివాహితుడు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం


హ్యాండ్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కందికుంట నారాయణమ్మ స్మారక రాష్ట్రస్థాయి బాలబాలికల హ్యాండ్ బాల్ టోర్నీ ప్రారంభమైంది. బాలుర లీగ్‌లో విజయనగరం అనంతపురంపై 18-9 గోల్స్‌తో, కర్నూలుపై 23-9 గోల్స్‌తో, విశాఖపట్నం జట్టు 14-1 గోల్స్‌తో కడపపై, నంద్యాల జట్టు 16-1 గోల్స్‌తో శ్రీకాకుళంపై గెలుపొందాయి. వెస్ట్ గోదావరి జట్టు 18-10 గోల్స్‌తో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై, బాలికల విభాగంలో శ్రీకాకుళం 1-0 గోల్స్‌తో గుంటూరుపై, శ్రీకాకుళం 8-1 గోల్స్‌తో కర్నూలుపై విజయం సాధించింది. కర్నూలు 6-5 గోల్స్‌తో అనంతపురంపై, శ్రీ సత్యసాయి జిల్లా జట్టు 5-3 గోల్స్‌తో నంద్యాలపై, 4-1గోల్స్‌తో అనంతపురం జట్టుపై నెగ్గింది. కార్యక్రమంలో శ్రీసత్యసాయిజిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శనివారోత్సవం .. భక్త జన సందోహం


శనీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

పావగడ: ద్వితీయ శ్రావణ శనివారోత్సవం సందర్భంగా స్థానిక శనీశ్వరాలయం వేలాది మంది భక్తులతో జనసందోహంగా మారింది. ఆలయ ప్రాంతంలో ఎటు చూసినా భక్తులే కన్పించారు. ఏ నోట చూసినా శనీశ్వరా కాపాడు తండ్రీ అనే మాటే విన్పించింది. ఆంధ్ర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటకలోని శివమొగ్గ, దావణగెరె, చిత్రదుర్గం, చళ్లకెరె తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయంలో శనీశ్వరస్వామి నవగ్రహాలు, శీతలాంభదేవి కి ఉదయం నుంచి పూజలు జరిగాయి. దీక్షా మంటపం లో భక్తులు స్వామి కి తలనీలాలు సమర్పించుకున్నారు. స్నానమాచరించిన చోటే పాత దుస్తులు వదిలేసి కొత్త దుస్తులు ధరించారు. అనంతరం శనీశ్వరుని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఆలయ సమితి పదాధికారులు, సిబ్బంది, స్వయం సేవకులు చర్యలు చేపట్టారు.

21న జాబ్ మేళా

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 21న గిరిజన విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన గిరిజన విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జాబ్‌మేళా నిర్వహిస్తుందని, వివరాలకు 7981333346 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సంభవామి యుగేయుగే!


సంభవామి యుగే యుగే సంగీత నృత్యరూపకంలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: దుర్గాదేవి ఆశీస్సులతో ఎన్టీఆర్ జిల్లా విరాజిల్లుతున్న తీరును వివరిస్తూ బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన సంభవామి యుగేయుగే నృత్య రూపకం భక్తులను రంజింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఎన్టీఆర్‌జిల్లా సత్యసాయి భక్తులు శనివారం సత్యసాయి సన్నిధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి యూత్ సభ్యులు సంగీత విభావరి పేరుతో చక్కటి భక్తిగీతాలు ఆలపించారు. సత్యసాయిని, సర్వదేవతలను కొనియాడుతూ వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. సాయంత్రం దుర్గామాత ఎన్టీఆర్ జిల్లాపై చూపుతున్న కరుణా కటాక్షాలను వివరిస్తూ సంభవామి యుగే యుగే పేరుతో సంగీత నృత్య రూపకం ప్రదర్శించారు. జిల్లాలోని ప్రముఖులు పింగళి వెంకయ్య, విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ బాలమురళీ కృష్ణల జీవిత ఘట్టాలను చక్కగా వివరించారు. ఏడు దశాబ్దాల క్రితం సత్యసాయి విజయవాడ నగరాన్ని సందర్శించి అక్కడ సత్యసాయి సేవా యూనిట్‌ను స్థాపించినప్పటి నుంచి నేటి వరకు సాధించిన ప్రగతిని కళ్లకు కట్టారు. పిదప సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.